# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | ఆదర్శ సమాజ నిర్మాణంలో సాహిత్యం పాత్ర | - డా॥. వెల్దండి శ్రీధర్ | 28 |
| 2. | ఆధునిక సమాజ నిర్మాణం - గురజాడ సాహిత్య కృషి | - డా॥. జెన్నె యోగీశ్వరనాయుడు | 32 |
| 3. | ఆదర్శ సమాజ నిర్మాణం - నీతి కథల పాత్ర | - డా॥. బాశెట్టి లత | 35 |
| 4. | స్త్రీవాద కవిత్వం - సాంఘిక చైతన్యం | - డా॥. కొయ్యా శ్రీనివాసులు | 38 |
| 5. | ఆదర్శ సమాజ నిర్మాణంలో ఎ.ఎ. నాగేంద్ర కవిత్వం | - డా॥. బత్తుల అశోక్ కుమార్ | 42 |
| 6. | రాచపాళెం గారి రెండు ప్రపంచాలు కావ్యం - సామాజిక సంస్కరణ | - డా॥. ఎ. ఎ. నాగేంద్ర | 47 |
| 7. | ఆదర్శ సమాజ నిర్మాణంలో జాతీయతా భావస్ఫోరక సాహిత్యం | - కప్పల శ్రీరాములు | 51 |
| 8. | పల్లేటి నాటకాలు - మత సామరస్యం | - డా॥. కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి | 55 |
| 9. | ఆదర్శ సమాజ నిర్మాణంలో కవులు రచయితల పాత్రికేయుల పాత్ర | - ప్రత్తిపాటి సుభాషిణి | 59 |
| 10. | ఎం.వి.ఆర్. శంఖారావం వ్యాస సంపుటి - సామాజిక పరిశీలన | - యస్. గంగాధర రెడ్డి | 62 |
| 11. | నీలవేణి కథల సంపుటి - సామాజిక అంశాలు | - డా॥. సింగర వాణి | 68 |
| 12. | ఆంధ్ర మహాభారతం - సామాజిక శ్రేయస్సు | - వంకం భాస్కర్ | 71 |
| 13. | ఆదర్శ సమాజ నిర్మాణంలో సాహిత్యపు పాత్ర | - డా॥. నేమాని శారద | 74 |
| 14. | ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగంగా-భారతదేశం జానపద కథకి పుట్టినిల్లు | - డా॥. కడివెండి మమత | 77 |
| 15. | ఆదర్శ సమాజ నిర్మాణంలో కవి, రచయిత మరియు అష్టావధాని "పద్మశ్రీ" డాక్టర్ ఆశావాది ప్రకాశరావు గారి కృషి | - డా॥. ఆశావాది సుధామ వంశి & - ఆశావాది శశాంకమౌళి | 81 |
| 16. | ఆదర్శ సమాజ నిర్మాణం స్త్రీ వాద కథ | - డా॥. యు. ఝాన్సీ | 86 |
| 17. | ఆదర్శ సమాజ నిర్మాణం - ఆధునిక తెలుగు కవిత్వం పాత్ర | - పల్లా కృష్ణ | 93 |
| 18. | ఆదర్శ దళిత సమాజ నిర్మాణంలో "మాదిగోడు" కథా రచయిత నాగప్పగారి సుందరరాజు కృషి | - డా॥. భీమినేని శివసాయి ప్రసాద్ | 97 |
| 19. | డా॥. పతికి రమేష్ నారాయణ 'ఎర్రని ఆకాశం'-ఆదర్శ సమాజ నిర్మాణ భావనలు | - కనుమల మునిస్వామి | 101 |
| 20. | విద్వాన్ చొప్ప వీరభద్రప్ప "బాలసాహిత్యం" - ఆదర్శ సమాజం | - బసినేని శ్రీనివాసులు | 106 |
| 21. | ప్రపంచానికే ఆదర్శం భారతదేశ ఆతిథ్యం | - కే.హరీష్ కుమార్ | 113 |
| 22. | ఆదర్శ సమాజ నిర్మాణంలో 'రక్తస్పర్శ' కవుల కవిత్వానుశీలన | - భూక్యా కాశీరామ్ | 116 |
| 23. | ఆదర్శ సమాజ నిర్మాణంలో దేవులపల్లి కృష్ణమూర్తి - నవలానుశీలన | - జాగర్ల మహేందర్ | 120 |

# ఆదర్శ సమాజ నిర్మాణం - ఆధునిక తెలుగు కవిత్వం పాత్ర

- డా॥. పల్లా కృష్ణ , వైస్ ప్రిన్సిపల్, తెలుగు ఉపన్యాసకులు, సిఎస్ఎస్ఆర్ & ఎస్ఆర్ఆర్ఎమ్ డిగ్రీ మరియు పిజి కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

ఒకే సంస్కృతి, దానితో సంబంధస్పృహ ఉన్న జనసమూహం సమాజం. కొన్ని కొన్ని సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు జీవనవిధానాలు, విశ్వాసాలు, కళలు మొదలైన సాంస్కృతికాంశాలు మానవాళిలో కొందరికి సమానంగా ఉంటాయి. అలాంటి సామాన్య సంబంధమున్న జనసమూహాన్ని సమాజం అంటాము. కులవ్యవస్థ, శ్రమవిభజన, సహకారం, సంబంధం, భావవినిమయం సమాజానికి శ్రీరామరక్ష. ఈ సమాజం ఒకేచోట నివసిస్తున్నా ప్రజలలో జాతి, కుల, మత, వృత్తిపరంగా అనంతమైన జీవనవైవిధ్యం ఉంది. ఈ జీవన విధానంలో మనిషి అనేక పార్శ్వాలతో జీవించడం కనిపిస్తోంది. ప్రేమ, మమత, స్నేహం, జాలి, దయ, కోపం, ద్వేషం, భయం ఇత్యాదులు మనిషి తత్వాన్ని తెలియ జేస్తున్నాయి. అయితే మనుషుల్లో రాను రాను స్వార్థం ఎక్కువగా కనిపిస్తుంది. దీని వల్ల సమాజంలో సంకుచిత ఆలోచనలు పెరిగి మనిషి కుచించుకుపోవడం తెలుస్తోంది. కవులు, రచయితలు ఈ అంశాన్ని సాహిత్య వస్తువుగా తీసుకుని సమాజంలో మార్పు కోసం తపన పడటం, ఆందోళన చెందడం, పోరాటాలు చేయడం చూస్తున్నాం.

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన, మహనీయులు ఎందరో కలరు. నేటికీ ఆధునిక సాహిత్యం కోసం తమ వంతు కృషి చేస్తున్న సాహితీవేత్తలు ఉన్నారు. ఆధునిక సాహిత్యం అనే మహావృక్షానికి ఉన్న అనేక శాఖలలో కవిత్వం ఒక ప్రదాన శాఖగా అభివర్ణించవచ్చు. ఆధునిక తెలుగు కవిత్వం నేడు తన పరిధిని బహు ముఖీనంగా విస్తరింపచేసుకుంది. ఆధునిక తెలుగు కవిత్వం ఆదర్శ సమాజ నిర్మాణంలో పెద్ద భూమికనే పోషిస్తున్నదని చెప్పవచ్చు. ప్రతి కవి కూడా ఎక్కువ భాగం ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగస్వామి కావాలనే కోరుకుంటాడు. అందుకు తగ్గట్లుగా కవితావస్తువును ఎంచుకుంటాడు. ఆధునిక కవి సమకాలీన సమాజాన్ని చక్కగా తమ రచనలలో ప్రతిబింబిస్తున్నాడని చెప్పవచ్చు.

నాటి నుండి నేటికీ వరకు కవులు ఆదర్శ సమాజ నిర్మాణానికి కృషి చేసిన వారు, చేస్తున్న వారు ఉన్నారు. ఈ నేపధ్యంతో ఆధునిక తెలుగు కవులు తమ కవిత్వంతో సమాజంలో మార్పులు ఆశిస్తూ, సమసమాజ నిర్మాణం కోసం పాటుపడటం గమనించవచ్చు.

## ఆదర్శ సమాజ నిర్మాణంలో ఆధునిక కవిత్వం పాత్ర :

ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగంగా ఆధునిక తెలుగు కవుల కవిత్వాన్ని పరిశీలిస్తే - ఆధునికత అన్నది గురజాడ నుంచే ప్రారంభము. ఛందస్సులో భాషలో, విషయంలో సాంఘికవ్యవస్థలో ఆయన తీసుకున్న చొరవ తర్వాతి తరం రచయితలకు దారిబత్తెమైంది. భాషా విషయకంగా గిడుగు తెచ్చిన విప్లవాన్ని స్వాయత్తం చేసు కొన్నాడు. సమకాలీన సామాజిక స్థితిగతుల్ని కందుకూరి నుంచి స్వీకరించాడు. సామాజికత, వర్తమానత, మానవతా అనే త్రివిధ సూత్రాల్ని తన సాహిత్యంలో విస్తృతంగా ప్రక్షేపించాడు.

ఈనాడు స్త్రీ పురుషులు పరస్పరం ఇచ్చి పుచ్చుకునే వరశుల్క, కన్యాశుల్కాలుగానీ, వివాహవిధిలోని సంప్రదాయ విచ్ఛేదకత గానీ మిగిలిన అన్ని సాంఘిక ధర్మాలను తనదైన ఆలోచనా స్రవంతిలోకి తెచ్చు కున్నాడు.

నేడు బాల్య వివాహాల దురాచారం నామ మాత్రాక శిష్టమై ఉంది. కన్యాశుల్కం తుడిచి పెట్టుకు పోయింది.

వరశుల్కం వెర్రితలలు వేసిన స్థాయినుంచి ఆలోచనా స్థాయిలోకి దిగివచ్చింది. విధవా వివాహాలు కులాంతర, మతాంతర వివాహాలు, విడాకుల విధానం స్త్రీ విద్యపట్ల అవగాహన, స్త్రీకి ఆర్థిక స్వావలంబన కల్పన గురజాడ ప్రసాదించిన ఆధునికమైన ఫలాలు.

గురజాడ వారి 'పూర్ణమ్మ'లో వారి భావనా శక్తి కవిత్వం అంచుల్ని, లోతుల్ని ముట్టింది. బాల్యవివాహాల విముఖత, కన్యాశుల్కం నిరసన, మూఢసంప్రదాయాల ఖండనలతో నాటి సమాజంలో పేరుకుపోయిన సంకుచిత భావజాలాన్ని అద్భుతమైన శిల్పదృష్టితో, వర్ణనలతో, శైలీ విన్యాసంతో కరుణరసాత్మకమైన గాథను నిర్మించాడు.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా!
వొట్టి మాటలు కట్టిపెట్టోయి
గట్టి మేల్ తలపెట్టవోయి" అంటూ -
"స్వంత లాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడుపడువోయి,
"దేశమంటే మట్టికాదోయి,
దేశమంటే మనుషులోయి!" లాంటి మహాసూక్తులతో దేశభక్తిని చాటుతూ ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యులయ్యారు. ముత్యాలసరాలులో విశ్వమానవ సౌభ్రాతృత్వం, విశ్వమానవ కళ్యాణం, విశ్వ శ్రేయస్సును ఆకాంక్షించాడు గురజాడ. 'యెల్ల లోకము వొక్క యిల్లై' అంటూ లోకాన్నే ఒక ఇల్లుగా, మానవులంతా సోదరులుగా మెలగాలని గురజాడ పేర్కొన్నారు.

1940 తార్వాత ఒక దశాబ్దం పాటు ఆంధ్ర సాహిత్య లోకాన్ని ఉత్తేజితం చేసిన అభ్యుదయ కవిత్వోద్యమ మూలవిరాట్టు 'శ్రీశ్రీ'. వాస్తవికతతో పాటు అధివాస్తవికత, వ్యక్తి చైతన్యంతో పాటు సంఘ చైతన్యాన్ని సమానంగా ప్రభోదించారు. 1933లో రచించిన 'జయభేరి' వచన గేయ ఖండికలో -

"నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను!
నేను సైతం
విశ్వవృష్టికి
అశ్రు వొక్కటి ధార పోశాను!
నేను సైతం
భువన ఘోషకు
వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను!" అంటూ కొనసాగే గేయ ఖండికలో వ్యక్తి చైతన్యం సామాజిక చైతన్యంలో భాగస్వామ్యం అని తెలియజేశారు.

లోకమంతటా వర్గ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రయత్నించారు. శ్రీశ్రీని మార్క్సిజం బాగా ప్రభావం చూపింది. ఇది ఆయనలో సామాజిక దృక్పథాన్ని వెలిగించింది.

దోపిడీకి గురౌవుతున్న కార్మిక, శ్రామిక వర్గాల్ని అంతటినీ మరో ప్రపంచం పిలిచింది అంటూ 'మహాప్రస్థానం'లో

మరో ప్రపంచం,
మరో ప్రపంచం,
మరోప్రపంచం పిలిచింది!
పదండి ముందుకు, పడండి త్రోసుకు! పోదాం, పోదాం పైపైకి! అంటూ నూతన ప్రపంచం పట్ల కుతూహలాన్ని రగుల్ కొల్పాడు. "ఈలోకం మీదేనండి, మీ రాజ్యం మీ రేలండి!" అని ముగించి రాజ్యాధికారాన్ని వ్యక్తుల నుంచి తప్పించి సమాజానికి ఇప్పించడమే కవిత్వపు తుది లక్ష్యం అన్నాడు. శ్రామికులతో 'తిరుగుబాటు మా వేదాంతం' అనిపించారు. "ప్రపంచమంతట అభివృద్ధిని కాంక్షించే కవుల స్వప్నాలు రష్యన్ విప్లవంలో ఆకృతి ధరించడం నాకు కనపడింది. సామాజిక విప్లవానికి సాహిత్యవిప్లవం, చాలు అన్న దృఢనిశ్చయం ఏర్పడింది" - అంటాడు శ్రీశ్రీ. సమసమాజ స్థాపనలో శ్రీశ్రీ గారి మార్గం అనితరసాధ్యం. ఆదర్శ సమాజ నిర్మాణానికి

అభ్యుదయ కవిత్వాన్ని ఆయుధంగా ప్రయోగించిన మహనీయుడు, మహాకవి శ్రీశ్రీ.

మా'నవ' కవిగా, మానవతావాదిగా పేరుగాంచిన కవి 'బాలగంగాధర తిలక్'. తిలక్ కవిత్వాన్ని పరిశీలించితే ఆయన మానవతాదృక్పథం వ్యక్తమవుతుంది. 'ఆర్తగీతం'లో

"నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు
కింద మరణించిన ముసలివాణ్ణి
నేను చూశాను నిజంగా నీ రంధ్ర వర్షాన వంతెన
కింద
నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని
నేను చూశాను నిజంగా తల్లిలేక తండ్రిలేక తిండిలేక
ఏడుస్తూ ఏడుస్తూ ముంజేతుల కన్నులు
తుడుచుకుంటూ మురికి కాల్వ పక్కనే నిద్రించిన
మూడేళ్ళ పసిబాలుణ్ణి"

అంటూ అభాగ్యుల, అనాధల దుస్థితిని, దీనస్థితిని మన ముందుంచాడు.

"నా కవిత్వం కాదొక తత్త్వం
మరికాదు మీరనే మనస్తత్వం
కాదు ధనికవాదం, సామ్యవాదం" అంటూ 'అమృతం కురిసిన రాత్రి'లో తమ కవిత్వం గురించి చెప్పుకున్నారు.

ఆధునిక సాహిత్యం అన్ని రకాలైన మానవీయ విధ్వంసకర ప్రవృత్తుల్ని ధీరంగా నిలిచి ప్రశ్నించే స్థాయికి ఎదిగింది. ఈ కుంపటిలోంచి వచ్చిన అభ్యుదయ కామనలే స్త్రీవాద, దళితవాద, ముస్లింమైనారిటీవాద ఉద్యమాలు.

ఆధునిక కవిత్వంలో స్త్రీవాద కవిత్వం 1980 ప్రాంతం నుంచి వస్తూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఎన్ని ఉద్యమాలు వచ్చినా ఆ ఉద్యమాల ప్రభావంతో స్త్రీల దైనందిన జీవనశైలిలో మార్పురానందున స్త్రీలకోసం, స్త్రీలచేత ఆవిర్భవించిందే స్త్రీవాద కవిత్వం. ఆది నుంచి సమాజంలో మగవారికి తోడుగా నడిచిన స్త్రీని - తక్కువగా చూడడం, చూపడం జరిగిందనవచ్చు. అన్నింటికీ ఆడది కావాలి కానీ ఆధిపత్యం మాత్రం మగవాడిదే అనే కోణంలో నుంచి జ్వలిస్తూ, జనించిందే స్త్రీవాద కవిత్వం.

1990లో వచ్చిన త్రిపురనేని శ్రీనివాస్‌గారి 'గురిచూసి పాడేపాట', 1993లో అస్మిత వారి 'నీలి మేఘాలు' వంటి కవితా సంకలనాలు స్త్రీవాద కవిత్వాన్ని బలంగా ప్రకటించాయి.

"అందమైన దోపిడీకి - పవిత్రమైన హింసకూ, న్యాయమైన దాస్యానికీ - బలైపోయిన నేను, భారత స్త్రీని!" అంటూ "నీలిమేఘాలు" సంకలనంలో 'ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి' కవిత ద్వారా 'ఓల్గా'గారు, "వర్గ శత్రువు నాశ్రమనే దోచుకుంటారు, ఈ దుష్ట శత్రువు నా బ్రతుకే దోచుకుంటాడు" అని 'మిత్రవైరుధ్యమా!' అనే కవిత ద్వారా 'మొక్కపాటి సుమతి'గారు, "నేనొక స్త్రీని - నేనొక నిషిద్ధ జీవిని" అంటూ 'శ్రీమతి' గారు, ఇలా 'బందిపోట్లు' - 'సావిత్రి'గారు, 'వంటిల్లు' - 'విమల'గారు, 'లేబర్ రూమ్' - 'కొండేపూడి నిర్మల' గారు, "వామనుడి మూడో పాదం", "యశోధరా వగపెందుకే" ద్వారా 'జయప్రభ' గారు స్త్రీవాద కవిత్వం ఆవేదనను, సంఘర్షణను, తీవ్రతను తెలియజేశారు.

దళిత చైతన్యానికి మూలపురుషుడు 'జాషువా' గారు. గబ్బిలం ద్వారా దళిత చైతన్యం రగుల్కొల్పారు. అలాగే 'బోయి భీమన్న', 'కుసుమ ధర్మన్న', 'కొలకలూరి ఇనాక్', 'ఎండ్లూరి సుధాకర్' వంటి మొదలైన కవులు తమ కవిత్వం ద్వారా అణచివేతకు, అవమానాలకు గురౌతున్న దళితులపక్షాన ఉద్యమించారని చెప్పవచ్చు. గద్దర్, వంగపండు వంటి వారు పాటల ద్వారా ఉద్యమస్ఫూర్తిని నింపారు. అలాగే 1991లో 'వి.సిమ్మన్న', 'కొండపల్లి సుదర్శన రాజులు' 'దళిత కవిత' సంకలనాన్ని ప్రచురించడం విశేషం. 1993లో 'జయధీర్ తిరుమలరావు' సంపాదకుడుగా "దళిత గీతాలు" సంకలనం, 1995లో 'జి.లక్ష్మీనరసయ్య', 'త్రిపురనేని శ్రీనివాస్'ల "చిక్కనవుతున్నపాట", 1996లో 'జి.లక్ష్మీనరసయ్య' సంపాద

కుడుగా "పదునెక్కిన పాట" వంటి మొదలైన దళిత సంకలనాలు వెలువడ్డాయి.

"నేనింకా నిషిద్ధమానవుణ్ణే - నాది బహిష్కృత శ్వాస" అంటూ 'ఎండ్లూరి సుధాకర్'గారు దళిత స్పృహను బలంగా వ్యక్తీకరించారు. "నిలువుటద్దం ముందు నిల్చుంటాన్నేను - అవయవాల దొంతరకాదు - అవమానాల పరంపర కనిపిస్తుంది" అంటూ "పంచమ వేదం"లో ఘోషిస్తాడు కవి 'సతీష్‌చందర్'.

"నేను పుట్టక ముందే
దేశద్రోహుల జాబితాలో
నమోదై వుంది నా పేరు" అని 'పుట్టుమచ్చ'లో మైనారిటీల ఆవేదనను, అణచివేతను కవి 'ఖాదర్ మొహియుద్దీన్' గొంతెత్తుతాడు.

ఈ విధంగానే బహుజన వాదకవిత్వం కూడా అందర్ని ఆలోచింపచేస్తుంది. 2001లో 'స్పృహ' సాహితీ సంస్థ వారు వెనుకబడిన కులాల కవిత్వంగా "వెంటాడే కలాలు" అనే కవితా సంకలనం వెలువరించడం జరిగింది.

ఈ విధంగా ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగంగా కవులు తమ కవిత్వం ద్వారా విశేషమైన సేవ చేశారని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. గురుజాడలు - పెన్నేపల్లి గోపాలకృష్ణ(సం) - మనసు ఫౌండేషన్.
2. మహాప్రస్థానం - శ్రీశ్రీ.
3. తెలుగు సాహిత్య చరిత్ర - డా.ద్వా.నా.శాస్త్రి.

❖❖❖